## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-07-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- జనాభా.. దేశానికి బలమైన ఆర్థిక వనరు అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- గంజాయి సాగు, రవాణాకు గిరిజనులు దూరంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు సూచించారు.
- కాకినాడలోని వైద్యకళాశాల ఘటన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు సచివాలయంలో జరిగిన ప్రపంచ జనాభా దినోత్సవంపై మొదటి అమరావతి సమ్మిట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. “జనాభా నిర్వహణా విధానం ప్రతి కుటుంబం ముఖ్యం-మీ అభిప్రాయం మార్గదర్శనం” అనే ఇతివృత్తంతో రూపొందించిన సర్వేను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జనాభా.. దేశానికి బలమైన ఆర్థికవనరు అని అన్నారు. అగ్రదేశాలతో భారత్ పోటీ పడుతోందంటే దానికి జనాభానే కారణమన్నారు. జనాభా ఎక్కువ ఉన్న దేశాలపై ప్రపంచం ఆధారపడే పరిస్థితి ప్రస్తుతం నెలకొందన్నారు. జనాభా పెరుగుదలకు త్వరలో మంచి విధానాన్ని తీసుకొస్తామని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో శిశు సంరక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

==========================

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో “గంజాయి రహిత సమాజం – కార్యచరణ” అవగాహన కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహించారు. హోంమంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముఖ్య అతిధులుగా

పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం “స్వచ్ఛ సంకల్పం” గోడపత్రికను ఆవిష్కరించి, రైతులకు సిల్వర్ ఓక్, కాఫీ, నేరేడు, పనస మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో పాడేరు, అరకు ప్రాంతాలకు ప్రత్యేకత ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గంజాయి కట్టడిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఈగల్ టీం ద్వారా గంజాయి నివారణపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విశాఖ సెంట్రల్ జైల్లో 700 మంది గిరిజనుల పిల్లలు ఉన్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి వ్యాపారులు, దళారులపై ఉక్కుపాదం మోపుతున్నామని చెబుతూ.. గిరిజనులు గంజాయి జోలికి పోవద్దని, జాగ్రత్తగా వ్యవహరించాలని వంగలపూడి అనిత సూచిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

===========================

ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు అన్నారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మార్కెట్ కమిటీ ఆవరణంలో వ్యవసాయ ఆధునిక యాంత్రీకరణ ప్రదర్శనను ఈరోజు ఆయన ప్రారంభించారు. అనంతరం వివిధ సంస్థలు ఏర్పాటు చేసిన వ్యవసాయ యంత్రాలను పరిశీలించి, మినీ ట్రాక్టర్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాదికి నర్సీపట్నం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో ప్రథమ స్థానంలో నిలిపే లక్ష్యంతో పని చేస్తున్నామని చెప్పారు. రైతులు.. అవసరమైన యంత్రాలను ఎంపిక చేసుకుని, వ్యవసాయంలో పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ఈ యంత్రాలను వినియోగించాలని సూచించారు. యంత్రాల వినియోగంతో తక్కువ సమయంలో ఎక్కువ పని పూర్తయ్యి, సమయం, ఖర్చులు ఆదా అవుతాయని అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు.

===========================

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ వివరాలు అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్. వి. భవానీ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జిపిఎఫ్ వార్షిక ఖాతా వివరాలను ag.ap.nic.in వెబ్ సైట్ లో పొందుపరచినట్టు పేర్కొన్నారు. ఖాతాదారులు వారి ఖాతా వివరాలను చూసుకోవచ్చని తెలియజేశారు.

===========================

కాకినాడలోని రంగరాయ వైద్యకళాశాల ఘటన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విద్యార్థినులపై సిబ్బంది లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి వైద్యారోగ్యశాఖ అధికారులు ముఖ్యమంత్రికి నివేదిక అందజేయగా.. దీనిపై స్పందించిన ఆయన.. నిందితులపై చర్యలకు ఆదేశించారు. వైద్య కళాశాల సిబ్బంది పలువురు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు ఫిర్యాదులు రావడంతో కళాశాల అంతర్గత కమిటీ ద్వారా విచారణ జరిపించారు. కొంతమంది సిబ్బంది తమ పట్ల అభ్యంతరకరంగా వ్యవహరించినట్టు సుమారు 50 మంది విద్యార్థినులు కమిటీ సభ్యులకు వెల్లడించారు.

విరామం

===========================

ప్రజలను చైతన్యపరచడంలో పత్రికా రంగం పాత్ర కీలకమైనదని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (PIB) ఆధ్వర్యంలో పాత్రికేయుల కోసం “వార్తాలాప్” పేరుతో ఈరోజు నిర్వహించిన కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిర్ణయాలు, పథకాల ఉద్దేశం ప్రజలకు చేర్చడంలో మీడియా.. ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రోడ్డు, రవాణా సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ... ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిజం.. నిష్పక్షపాతంగా వార్తలు రాస్తూ.. సమాజంలో గొప్ప మార్పు తీసుకురావచ్చని అన్నారు. పీఐబీ కార్యకలాపాలను, అందిస్తున్న సేవలను బ్యూరో సహాయ సంచాలకులు రమేష్ చంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా

వివరించారు. విలేకరుల సమావేశాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, నీతి అయోగ్, ఎన్నికల సంఘం తదితర సంస్థల కార్యక్రమాల ప్రచారం మొదలైన విధులను పీఐబీ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

============================

చిన్నారుల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదనే ఉద్దేశ్యంతో "తల్లికి వందనం" కార్యక్రమం చేపట్టామని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులకు ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ "తల్లికి వందనం" పథకం వర్తింపజేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించకపోయినా ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

============================

జిందాల్ భూములకు సంబంధించి మిగిలిన రైతులకు పరిహారాన్ని వారం రోజుల్లో అందజేయాలని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. జిందాల్ సంస్థకు భూ కేటాయింపులు, పరిహారం అంశాలపై సంబంధిత అధికారులతో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించి, ఇప్పటివరకు చెల్లించిన పరిహారం, పెండింగ్ బకాయిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 28 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి 15 మంది రైతులకు మాత్రమే పరిహారం బకాయి ఉండగా, వీరిలో ముగ్గురికి ఇటీవలే చెల్లించామని అధికారులు వివరించారు. మిగిలిన వారికి వారంలోగా పరిహారాన్ని అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

============================

లండన్ లోని లార్డ్స్ వేదికగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరుగుతున్న మూడవ టెస్ట్ మ్యాచ్ లో 251 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లాండ్ జట్టు తొలి సెషన్ ఆరంభంలోనే మూడు వికెట్లు కోల్పోయింది. దీంతో భోజన విరామ సమయానికి 7 వికెట్ల నష్టానికి 353 పరుగులు చేసింది.

============================

రాష్ట్రంలోని దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వీటి ఫలితంగా రాగల రెండు రోజులలో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని ఒకటి రెండు చోట్ల.. తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. ఉరుములతో కూడిన మెరుపులతో పాటు.. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు.

============================
============================